# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ ప్రగతిలో యువత పాత్ర కీలకమని "మన్ కీ బాత్" కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ స్వదేశీ ఉత్పత్తుల పట్ల ప్రజలలో ఆసక్తి పెరిగిందని ప్రధానమంత్రి అన్నారు.
- ❖ శ్రీరాముడు పాటించిన విలువలు, ఆదర్శాలు ప్రజలందరికీ శాశ్వతమైన పాఠాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ కోరారు.
- ❖ పట్టణాలకు దీటుగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

=========================

ప్రపంచం భారతదేశం వైపు చూడడానికి యువశక్తే ప్రధాన కారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 129వ సంచికలో భాగంగా ఆయన ఈరోజు మాట్లాడుతూ... దేశ అభివృద్ధిలో యువత పాత్రను ప్రస్తావించారు. వికసిత్ భారత్ సాకారం దిశగా సాగే ప్రయాణంలో యువ శక్తి కీలకం కానుందని అన్నారు. అంకుర పరిశ్రమలతో పాటు, వ్యవసాయం, ఫిట్‌నెస్ తదితర అంశాలలో యువత చేపడుతున్న నూతన ఆవిష్కరణలు బాగున్నాయని ప్రధానమంత్రి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న సరికొత్త సాంకేతికతను సైతం దేశీయ యువత అందిపుచ్చుకోవాలని నరేంద్రమోదీ సూచిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=========================

స్వదేశీ ఉత్పత్తుల పట్ల ప్రజలలో ఆసక్తి పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. "మన్ కీ బాత్" 129వ సంచికలో భాగంగా ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ఈ రోజు ప్రసంగించారు. ఈ సందర్భంగా నరసాపురం మహిళలు చేతివృత్తి ద్వారా తయారు చేసే లేసు ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందడం పట్ల ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. 250 గ్రామాలలో లక్షలాది మంది గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదుగుతున్నారని అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో తయారైన 500 రకాల క్రోచెట్ లేస్ ఉత్పత్తులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని, ఇది భారతీయ సంస్కృతి, నైపుణ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

శ్రీరాముడు పాటించిన విలువలు, ఆదర్శాలు ప్రజలందరికీ శాశ్వతమైన పాఠాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అయోధ్య రామాలయాన్ని ఆయన ఈ రోజు సందర్శించి శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం నిర్మాణానికి సంబంధించిన విశేషాలను ముఖ్యమంత్రికి ఆలయ నిర్వాహకులు వివరించారు. అయోధ్యలోని శ్రీ రామ జన్మభూమి మందిరంలో స్వామి దర్శనం చేసుకునే అవకాశం లభించడం అదృష్టమని సామాజిక మాధ్యమం పోస్టులో చంద్రబాబు నాయుడు తెలిపారు.

==========================

పట్టణాలకు దీటుగా ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా గార మండలంలో పలు అభివృద్ధి పనులకు స్థానిక శాసన సభ్యుడు గోండు శంకర్ తో కలసి ఆయన ఈ రోజు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతీ గ్రామాన్ని సుందర గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గతం కంటే ఎక్కువగా శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి జరుగుతోందన్నారు.

విరామం

==========================

తీర ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా దత్తత గ్రామమైన పశ్చిమ గోదావరి జిల్లా పెదమైన వానిలంక గ్రామంలో ఈ రోజు కేంద్రమంత్రి పర్యటించారు. డిజిటల్ శిక్షణా కేంద్రంలో డ్రోన్ శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. కృత్రిమ మేధా (ఏఐ) శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చే విద్య, క్రీడలపై యువత ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

మౌలిక సదుపాయాల రంగంలో భారతదేశం 2025లో సాధించిన ప్రగతికి సంబంధించి ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక కథనం..

దేశ అభివృద్ధిలో 2025 సంవత్సరం ఒక కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. మౌలిక సదుపాయాల రంగంలో భారతదేశం విశేష పురోగతి సాధించింది. రైలు, రోడ్డు, విమానయానం, సముద్ర రవాణా రంగాలలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాల కోసం కేంద్రప్రభుత్వం మూలధన పెట్టుబడి వ్యయం 11 లక్షల కోట్ల రూపాయలకు పెరగడం కీలక పరిణామం. ఈ ఏడాది భారతీయ రైల్వేల ప్రగతి చూస్తే... ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్ట్ కింద చీనాబ్ వంతెన ప్రారంభోత్సవం, అలాగే, మొదటిసారిగా మిజోరాం ప్రాంతాన్ని జాతీయ రైల్వే నెట్‌వర్క్‌కు

అనుసంధానించడం వంటివి ఉన్నాయి. దేశంలో మెట్రో నెట్‌వర్క్ 2014లో 240 కిలోమీటర్లుగా ఉంటే.. 2025 నాటికి వెయ్యి కిలోమీటర్లకు పైగా పెరిగింది. విమానయాన రంగంలో చూస్తే 2014లో 74గా ఉన్న విమానాశ్రయాల సంఖ్య 2025 నాటికి 163కి పెరిగింది. దేశంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ పొడవు 2019 మార్చిలో లక్షా 32 వేల కిలోమీటర్ల నుండి లక్షా 46 వేల కిలోమీటర్లకు పెరిగింది.

==========================

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య టీ-20 సిరీస్ లో భాగంగా తిరువునంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా నాలుగవ టీ-20 క్రికెట్ మ్యాచ్ మరికాసేపట్లో ప్రారంభం కానుంది. తొలి 3 మ్యాచ్‌లలో వరుసగా విజయం సాధించడంతో ఇప్పటికే భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది.

==========================

ఇంటింటికీ సురక్షిత తాగు నీరును అందించడంలో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ పథకం ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలంలో ఈరోజు జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జల్ జీవన్ మిషన్ ద్వారా ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 336 పనులకు గానూ 65 కోట్ల రూపాయల మేర నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామన్నారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద మెట్ట ప్రాంతాల్లోని పొలాలకు సాగునీటిని అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

==========================

ఆరోగ్యకరమైన జీవనానికి, కాలుష్య రహిత భవిష్యత్‌కు సైకిల్ సవారీ దోహదం చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. చిన్నారులు, యువత సైక్లింగ్‌ను ఓ ఆనందకరమైన అలవాటుగా చేసుకోవాలని కోరారు.

==========================
==========================